ప్రజాశక్తి

శుక్రవారం 13 జనవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఆగని అక్రమ మైనింగ్



చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం, శేకూరులోని క్వారీయింగ్ ప్రాంతంలో ఇటీవల పరిశీలనకు వెళ్లిన నరేంద్రకుమార్

- మొక్కుబడి తనిఖీలతో మైనింగ్ శాఖ
- టిడిపి ఫిర్యాదులను పట్టించుకోని యంత్రాంగం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో అక్రమ మైనింగ్ ఆగడం లేదు. పొన్నూరు నియోజకవర్గం పరిధిలో పలు గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు, పల్నాడులో ముగ్గురాయి, సున్నంరాయి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. చేబ్రోలు మండలంలో అక్రమ మైనింగ్‌పై టిడిపి మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర వివిధ స్థాయిలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రభుత్వం స్పదించడం లేదు. మైనింగ్ శాఖ అధికారులు గతంలో జరిమానాలు విధించి మమ అనిపించారు. ఇటీవల కాలంలో చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

అయితే టిడిపి ప్రభుత్వ హయాంలో మాదిరిగానే వైసిపి హయాంలోనే ఎక్కువగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు తెలిసినా ఉన్నత స్థాయిలో వస్తున్న ఒత్తిడి కారణంగా ఏమి చేయలేకపోతున్నారు. గతేడాది పలుమార్లు దాడులు చేసి రూ.62 లక్షలు జరిమానా విధించారు. ఈ ఏడాది ఇంతవరకు ఎటువంటి నియంత్రణ లేదు. ప్రధానంగా చేబ్రోలు మండలంలో ఎర్రమట్టి తవ్వకాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉండటంతో ఉన్నతాధికారులు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర మంత్రి ఒకరు, వైసిపి ఎంపి, పలువురు ఎమ్మెల్యేలకు ఇందులో వాటాలు ఉన్నట్టు ప్రచారమవుతోంది. మొత్తంగా చేబ్రోలు మండలంలో మళ్లీ అక్రమంగా ఎర్ర మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. టిడిపికి చెందిన నాయకులు కొంత మంది కూడా వైసిపి వారితో కలిసి తవ్వకాలకు సహకరిస్తున్నారనే ప్రచారం ఉంది. రాజకీయంగా టిడిపి, వైసిపి నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నా

2లో



ధర్నా విరమించబోమని పోలీసులకు చెబుతున్న రైతులు, నాయకులు

ఎడిఎ కార్యాలయానికి తాళం

- నకిలీ విత్తన డీలర్లపై పీడీ యాక్ట్ నమోదుకు రైతుల డిమాండ్
- బాధిత రైతులకు పరిహారం కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం వరకూ ఆందోళన



ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య

వార్త మెయిన్‌లో

తినకపోవటానికి కారణాలు గుర్తించాలి

మధ్యాహ్న భోజనంపై సమీక్షలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి 2 లో

ప్రత్యేక హోదా,విభజన హామీలపై బస్సుయాత్ర

రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాలు 2 లో

విద్యార్థి హత్య కేసులో పదేళ్ల జైలు

2లో

పోలీసు హెచ్చరికలున్నా..

తగ్గేదేలే.!



- కోడిపందేలకు సిద్ధమవుతున్న బరులు
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో నిర్వహణ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, భట్టిప్రోలు

సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలకు నిర్వాహకులు సన్నద్ధం అవుతున్నారు. పందేలు, జూదాలను సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఎంతగా చెబుతున్నా.. గతంలో ఎక్కడెక్కడ అయితే కోడిపందేలు నిర్వహించారో ఆయా ప్రాంతాల్లోనే కోడి పందేలకు కావలసిన అన్ని ఏర్పాట్లూ చేశారు. ముందుగా భోగి పండుగ రోజు పోలీసులు అభ్యంతరం చెప్పని పొట్టేళ్ల పోటీ, ముగ్గుల పోటీల లాంటివి పెట్టి ఆ తరువాత కోడిపందేల నిర్వహణకు సన్నద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రేపల్లె, భట్టిప్రోలు ప్రాంతాల్లో గ్రామాల వెలుపల, అంతగా జన సంచారం ఉండని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో కోడి పందేలకు బరులు సిద్ధం చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం, పల్లెకోనలో గ్రామం నుంచి రాచూరు వెళ్లే

2లో





సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

కెవిపిఎస్ రౌండ్‌టేబుల్ సమాశంలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు కోరారు. సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.కిషోర్ అధ్యక్షతన స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. చట్టాన్ని పొడిగించాలని ప్రజాప్రతినిధులకు మెమోరాండాలు వ్వాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ ఈ ఏడాది మార్చితో చట్టం కాలపరిమితి ముగుస్తుందని, దీంతో చట్టం రద్దు అయిపోతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, చట్టాన్ని కొనసాగించటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా నేటికీ దళితవాడలు, అభివృద్ధికి నోచుకోక వెనుకబడి ఉన్నాయన్నారు. దళిత, గిరిజన కాలనీలకు శ్మశాన స్థలాల సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో దళితులను ఉద్ధరిస్తామని ప్రకటనలు చేస్తున్నా, ఆచరణలో 27 సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాబోయే బడ్జెట్‌లో సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించాలని, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయింపు ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఉన్న పథకాలను కుదిస్తున్నారని అన్నారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించి, పటిష్టంగా అమలు చేయకుంటే రానున్న కాలంలో అన్ని సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని

2లో



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు



జిల్లా జట్టు కు ఎంపికైన క్రీడాకారులు

షూటింగ్ బాల్ బాలుర జిల్లా జుట్టు ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాప్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపిక చేపట్టారు. ఇందులో భాగంగా ఎంపికలను మండలంలోని గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించగా 30 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు జనవరి 14న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడలోని విజయ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పల్నాడు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ చావలి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికలను గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, కార్య నిర్వాహక కార్యదర్శి పి.శివరామకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా జిల్లా కో-ఆర్డినేటర్ ఎల్.పిచ్చయ్య, పిఇటిలు బి.అనిల్ దత్త నాయక్, షేక్ ఆదం షఫి పాల్గొన్నారు

బాలుర జిల్లా జట్టు ఇదే..

జి.నాగహనుమ, ఎల్.సాయి, బి.శేఖర్, వి.నరేష్, బి.శామ్యూల్, టి.సన్నీ, బి.మోస్ బాబు, చిన్న కాశీ, ఎస్కె.కాజా మొహిద్దీన్, ఎం.జీవన్‌రెడ్డి, కె.విజయభాస్కర్, కె.రామాంజినేయులు.

విద్యార్థి హత్య కేసులో పదేళ్ల జైలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

పొన్నూరు మండలం వల్లభారావుపాలేనికి చెందిన పాలిటెక్నిక్ విద్యార్థి తాడిపర్తి నవీన్ బాబు హత్య కేసులో అదే గ్రామానికి చెందిన తాడిపర్తి రవికి పదేళ్ల జైలు, రూ.వెయ్యి జరి మానా విధిస్తూ గుంటూరు జిల్లా 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.అర్చన గురువారం తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. వల్లభారావుపాలేనికి చెందిన తాడిపర్తి లక్ష్మయ్య రేషన్ డీలర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందని తాడిపర్తి కమలమ్మ వద్ద రూ.15 వేలు అప్పుగా తీసుకుని అందులో రూ.3 వేలు అప్పు తీర్చాడు. మిగిలిన రూ.12 వేలు ఇవ్వాలని కమలమ్మ లక్ష్మయ్యను అడగగా వాయిదా వేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో 2016 ఏప్రిల్ 15వ తేదీన రాత్రి 9 గంటల సమ యంలో డబ్బు విషయమై కమలమ్మ, లక్ష్మయ్యకు వాగ్వాదం తలెత్తింది. త్వరలో ఇస్తానని చెప్పి లక్ష్మయ్య, ఆయన భార్య చర్చికి వెళ్లారు. వారు తిరిగి రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇంటి వద్దకు కమలమ్మ, ఆమె కుమారుడు తాడిపర్తి రవి, అతని అన్నకొడుకు తాడపర్తి సురేష్‌కుమార్ (17) వెళ్లి లక్ష్మయ్యపై ఘర్షణకు దిగారు. ఆ సమయంలో లక్ష్మయ్య కుమారుడు పాలిటెక్నిక్ చదివే 24 ఏళ్ల తాడిపర్తి నవీన్‌బాబు వారికి సర్ది చెప్పటానికి ప్రయత్నిస్తుండగా రవి అక్కడున్న మంచం పట్టెను తీసుకొని నవీన్‌బాబు తలపై కొట్టాడు. లక్ష్మయ్యను కూడా కొట్టాడు. ఇది చూస్తున్న చుట్టుపక్కల వారు కలుగ చేసుకోవటంతో నిందితులు పరారయ్యారు. నవీన్‌బాబు తలకు తీవ్ర గాయం కావటంతో, పొన్నూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. దీనిపై లక్ష్మయ్య ఫిర్యాదుతో పొన్నూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ సిహెచ్.వి.బి సుబ్రహ్మణ్యం కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుత సిఐ పి.ప్రభాకర్ కేసు విచారణ సమయంలో పర్యవేక్షించారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి 324, 304 పార్ట్ 2 ఐపిసి కింద నిందితుడికి పదేళ్ల జైలు, రూ1.వెయ్యి జరిమాన విధించారు. తాడిపర్తి కమలమ్మపై కేసు రుజువు కాకపోవటంతో ఆమెపై కేసు కొట్టివేశారు. తాడిపర్తి సురేష్‌కుమార్ అలియాస్ గాబ్రియేల్ జువనైల్ కావటంతో జువజైన్ బోర్డులో కేసు విచారణలో ఉంది. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టటంలో కోర్టు కానిస్టేబుల్ బాణావత్ నాయక్ చొరవ చూపాడు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసం సూరిబాబు వాదించారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలపై బస్సుయాత్ర

రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న విద్యార్థి,యువజన సంఘాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుండి శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం నుండి ఫిబ్రవరి 4, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్ర నిర్వహిస్తున్న ఈ సందర్భంగా విద్యార్థి,యువజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం గుంటూరులో జరిగింది.

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇవ్వాలని,విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని ఈనెల 26న గుంటూరుకు విచ్చేస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి మాట్లాడుతూ ఆనాడు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న వారి మెడలు వంచైనా ఏపీకి ప్రత్యేక హోదా విభజన చట్టంలోని హామీలు నెరవేరుస్తా అని హామీ ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి ఈరోజు నరేంద్ర మోడీ, అమిత్ షా దగ్గర రాష్ట్రాన్ని తాకట్టు పెటారని అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్,కడప ఉక్కు, పోలవరం ప్రాజెక్ట్ కు నిధులు, ఉత్తర ఆంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజ్, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజ్,వంటి విభజన హామీలు నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

సిపిఎం నాయకులు ఈమని అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రం లో ఉన్న సమస్యలు కూడా కేంద్ర ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్న అప్పటి బిజెపి ప్రభుత్వం 5 కాదు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వాలని మోసపూరితమైన మాటలు పార్లమెంట్లో పలికి 5 కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసగించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు లింగంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ విభజన హామీలు నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా ముగిసిన అధ్యాయమని, కొంత మంది ప్రత్యేక హోదా అంశంపై రోజుకొక మాట మాట్లాడుతున్న వారు కళ్ళు తెరిచే విధంగా ఉద్యమం ఉధృతం చేస్తామని తెలియ జేశారు. జనసేన పార్టీ నాయకులు కొండూరు కిషోర్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు గని రాజు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల నాసర్ డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర కృష్ణకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్ ఏఐవైఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభానీ, తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టిఎఫ్ పోలీసులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సంక్రాంతి సందర్భంగా ఎస్‌టిఎఫ్ పోలీసులకు యూనిఫాంను జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ గురువారం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన పోలీసుదర్బార్ డేను నిర్వహించారు. గుంటూరు జిల్లా విధి నిర్వహణలో ఎస్‌టిఎఫ్ వారికి తగిన ప్రోత్సహం ఇస్తామని అన్నారు. విధినిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వహించాలని, అనధికారికంగా గైర్హాజరు అవుతూ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది కి నూతన సంవత్సరం కానుకగా డ్యూటీ చేస్తున్న సిబ్బందికి ప్రోత్సహించే ఉద్దేశంతో యూనిఫాం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ హాలులో వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన సమస్యల అర్జీలపై సత్వరమే పరి శీలించి తగిన చర్యలు తీసు కుంటామని భరోసా ఇచ్చారు.

తినకపోవటానికి కారణాలు గుర్తించాలి

మధ్యాహ్న భోజనంపై సమీక్షలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు



పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులందరూ తినే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు పురోగతిపై కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. మధ్యాహ్న భోజనం 80 శాతం కంటే తక్కువుగా తీసుకుంటున్న పాఠశాలలను గుర్తించాలని, భోజనాన్ని తీసుకోకపోవటానికి గల కారణాలను తెలుసుకోవాలని చెప్పారు. నూరు శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేలా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కోడిగుడ్లు, చిక్కీలు సకాలంలో సరఫరా అయ్యేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. కన్సిస్టమ్ రిథమ్స్ ద్వారా పాఠశాలలో గుర్తించిన చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను వెంటనే పాఠశాలలో చేర్పించాలని, గ్రామాల్లో బాల్య వివాహాల నివారణ కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ ప్రతినెలా నిర్దేశిత తేదీల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించేలా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. 10-19 ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థినులకు రక్తపరీక్షలు నిర్వహించి, రక్త హీనత ఉన్న వారిని గుర్తించి పౌష్టికాహారం అందించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లు, ఇం టింటికీ కుళాయిల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు.

పోలీసు హెచ్చరికలున్నా తగ్గేదేలే!

(మొదటి పేజీ తరువాయి)

మార్గంలో సుమారు 20 ఎకరాలల్లో కోడిపందేలకు సిద్ధం చేస్తున్నారు. కొత్త వారిని అటు వైపు రానీయకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరిగే ఈ కోడి పందేలను ఆ ప్రాంత పోలీసులు కూడా పట్టించుకునే పరిస్థితి లేదు. సంక్రాంతి పండుగ సమయంలో సాంప్రదాయ క్రీడలను వదిలి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన కోడి పందేలు వంటి వాటిలో పాల్గొని ఆర్థికంగా నష్టపోతున్నారు.

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాత్రం జిల్లాలో కోడిపందేలు, జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించామని చెబుతున్నారు. గతంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో ఏయే ప్రదేశాలలో కోడిపందేలు నిర్వహించారు? ఇప్పుడు ఎక్కడ నిర్వహించేందుకు అవకాశం ఉందో గుర్తించామని అంటున్నారు. కోడి పందేలు నిర్వహించడానికి అవసరమైన కోడి కత్తులను సరఫరా చేసే వారిపై, తయారు చేసే వారిపై నిఘా పెట్టారు. గతంలో కోడిపందేలు ఆడుతూ పట్టుబడిన 968 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ లేదా ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228 కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ చెబుతున్నారు.

ఆగని అక్రమ మైనింగ్

(మొదటి పేజీ తరువాయి)

అంతిమంగా ఎవరు అధికారంలో ఉంటే వారు అక్రమాలకు పాల్పడుతున్నారు.గత మూడున్నరేళ్లలో దాదాపు 80 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు జరిగినట్టు మైనింగ్ శాఖ గుర్తించింది. టిడిపి హయంలో ఐదేళ్లలో 20 వేల క్యూబిక్ మీటర్ల తవ్వకాలు జరగ్గా వైసిపి హయాంలో మాత్రం 80 వేల తవ్వకాలు జరగడం విశేషం. చేబ్రోలు మండలంలోని ఐదు గ్రామాల్లో తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఈ తవ్వకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే నాయకులకు వచ్చే ఆదాయం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటోంది. పల్నాడు ప్రాంతంలో కూడా అక్రమ మైనింగ్ జోరుగాసాగుతోంది. టిడిపి హయాంలో అక్రమ మైనింగ్‌పై గగ్గోలు పెట్టిన వైసిపి నాయకులు ఇప్పుడు అంతకంటే ఎక్కువగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పల్నాడులోని గురజాల, దాచేపల్లి, మాచవరం మండలాల్లో సున్నపురాయి తవ్వకాలకు అడ్డూ అదుపు ఉండటం లేదు. కొద్ది ప్రాంతానికి అనుమతి తీసుకుని 10 రెట్లు విస్తీర్ణంలో అదనపు తవ్వకాలు పారిపాటైంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగవేసి సున్నపు రాయిని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులు మొక్కుబడి తనిఖీలతో కాలక్షేపం చేస్తున్నారు. ఉన్నతాధికారులూ పట్టించుకోకపోవడం వల్ల జిల్లా అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సబ్ ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

పటిష్టంగా అమలు చేయాలని, ప్రతి నెలా విజిలెన్స్, మానిటరింగ్ కమిటిని సమావేశ పర్చి దళితుల అభివద్ధి అంశాలను చర్చించాలని కోరారు.

దళిత బహజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ మార్చి 23వ తేదీలోగా సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయకపోతే ఆటోమేటిక్‌గా రద్దు అవుతుందన్నారు.

ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలూ లేకపోవటం, దళిత, గిరిజనులపై ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇతర సామాజిక తరగతులతో సమానంగా ఎస్సీ, ఎస్టీలను సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అనేక పోరాటాల నేపథ్యంలో సబ్‌ప్లాన్ చట్టం వచ్చిందన్నారు. సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీ, ఎస్టీల వ్యక్తిగత, కుటుంబ, నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించటం సాధ్యం అవుతుందన్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న చట్టాన్ని కొనసాగించుకోవటానికి రానున్న కాలంలో ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ యువతకు నైపుణ్యం, విద్యను అందించటానికి ఈ చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశంలో బిసి సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ తాడికొండ నరసింహారావు, అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి బి.వీరాస్వామి, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ.చిస్టీ, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, సోషల్ యాక్టివిస్ట్ బి.విల్సన్, జెవివి నాయకులు ఎమ్‌డి.అక్బర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కిష్ణకాంత్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ ఛైర్మన్ ఎ.కుమార్, కెవిపిఎస్ నాయకులు నవీన్, సురేష్, తదితరులు మాట్లాడారు.

ఆలయ ప్రాంగణంలోని షాపులో చోరీ

ప్రజాశక్తి- తెనాలి

స్థానిక మార్కెట్ కూడలిలోని రాములవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న షాపులో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు అర్ధరాత్రి వేళ షాపు ముందున్న సీసీ కెమెరాలును తొలగించి షాపులోకి ప్రవేశించారు. గల్లాపెట్టెలోని రూ.20వేల నగదుతోపాటు, రూ. 10వేల విలువైన ఇతర దేశాల కరెన్సీని దొంగిలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సిసి టీవీ ఫుటేజి పరిశీలించి కేసు నమోదు చేశారు.

చికిత్సపొందుతున్న మహిళ మృతి

ప్రజాశక్తి నాదెండ్ల

ప్రమాదవశాత్తు ఒళ్ళు కాలిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని గురిజవోలు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై ఆవుల భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం గురిజవోలు గ్రామానికి చెందిన సంగుల సమాధానం (48)కు మతిస్థిమితం లేదు. ఈనెల 1వ తేదీన వారి ఇంటి ముందు కట్టెల పొయ్యి మీద నీళ్లు కాస్తుండగా మంటలు ఆమె బట్టలకు అంటుకొని ఒళ్లంతా కాలిపోయింది. వెంటనే ఆమెని గుంటూరు జిహెచ్ఎంసికి తరలించారు. అప్పటినుండి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు భర్త సంగీతరావు తెలిపారు. సంగీతరావు ఫిర్యాదు మేరకు నాదెండ్ల ఎస్ఐ ఆవుల భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి :	67,060
మిర్చి ఎగుమతి :	63,028
మిర్చి నిల్వ :	34,835

మిర్చి ధరలు

	రూపాయలలో
334	10000 - 26500
నెం.5	14000 - 25500
273	13000 - 20000
341	10000 - 24000
4884	13000 - 18000
సూపర్-10	13000 -18500
నాన్ ఎసి	
తేజ	9000 - 22000
బడిగె	10000 - 27000
దేవనూరు డీలక్స్	10000 - 27500
తాలుకాయలు	4,000 - 12,500
ఎసి	
334	14500 - 14500
సూపర్ -10	14000 - 25000
తేజ	13000 -20000
బడిగె	18000 - 22000
దేవనూర్‌డీలక్స్	22000 - 22000
తాలుకాయలు	5,200 - 11,000

చోరీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

- రూ.5.92 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి -తెనాలి

చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. నిందితుల వద్ద నుంచి పోలీసులు చోరీ కాబడిన సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో డిఎస్‌పి కె స్రవంతి రాయి వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాజర్ పేట చెరువు వారి వీధికి చెందిన పి.రత్నకుమారి ఈనెల 2న బంధువుల వెంట ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు నరసరావుపేటకు వెళ్ళింది. తిరిగి మూడో తేదీ ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలు తెరిచి ఇల్లంతా గందరగోళంగా ఉంది. వెంటనే పట్టణ వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఇంటి వెనుక వైపునున్న కిటికీ గ్రిల్ తొలగించి నిందితులు ఇంటిలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు పట్టణంలోని బాలాజీ రావు పేటకు చెందిన చిలువూరు నాగరాజు, ముత్తంశెట్టి వారి పాలెంకు చెందిన పోతురాజు సాయికుమార్, నందివెలుగు గ్రామానికి చెందిన పిల్లి సురేష్‌ను నిందితులుగా తేల్చారు. వీరిని కబేలా ప్రాంతంలో గురువారం అరెస్టు చేశారు. చోరీకి ఉపయోగించిన ఆటోతోపాటు నిందితులు చోరీ చేసిన నాలుగు బంగారపు గాజులు, రెండు పేటల చైను, మూడు ఉంగరాలు, ఐదు జతల చెవి దుద్దులు,ముక్కుపుడక ,వెండి ప్లేటు, కెమెరా, నాలుగు వెండి గ్లాసులు ,ఆరు చీరలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 107 గ్రాముల బంగారం, 800 గ్రాముల వెండిల విలువ దాదాపు రూ. 5,92,720 గా పేర్కొన్నారు. జిల్లా ఐటీ కోర్ విభాగంతో కలిసి కేసులు చేదించిన సీఐ కే.చంద్రశేఖర్, ఎస్సై ఉమామహేశ్వరరావు, ఏఎస్ఐ రాజు, సిబ్బందిని డిఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని, ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి స్రవంతి రాయి

విధుల్లోకి నూతన ఎస్ఐలు

పెదనందిపాడు నూతన ఎస్ఐగా అబ్దుల్ రెహ్మాన్

ప్రజాశక్తి- పెదనందిపాడు



ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్

పెదనందిపాడు మండల నూతన ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్ఐ డి. అశోక్ బదిలీపై నల్లపాడు స్టేషనుకు వెళ్ళారు. షేక్ అబ్దుల్ రెహమాన్ గుంటూరు దిశ పోలీస్ స్టేషన్ నుండి పెదనందిపాడు పోలీస్ స్టేషన్క బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతానని, అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

చేబ్రోలు నూతన ఎస్ఐగా కె.ఆనంద్

ప్రజాశక్తి - చేబ్రోలు



ఎస్ఐ కె. ఆనంద్

చేబ్రోలు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా కె. ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు సీసీఎస్ నుండి బదిలీపై చేబ్రోలు వచ్చినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని చేబ్రోలు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. ముఖ్యంగా మహిళల భద్రత, విజువల్ పాలసీ, ఫ్రెండ్లీ పాలసీతో ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. జూదం,పేకాట,గంజాయి, అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బోయపాలెం జాతీయ రహదారి పై ద్విచక్రవాహనం ఆర్‌టిసి బస్సును ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు శివపోలయ్య(38) ఎస్‌బి ఛానల్‌లో పాత్రికేయునిగా పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 11:30గంటల సమయంలో బోయపాలెం జాతీయ రహదారి పై ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సును అతి వేగంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



బహుమతులు సాధించిన వారితో నిర్వాహకులు

సందడిగా సంక్రాంతి పోటీలు

ప్రజాశక్తి - యడ్లపాడు

సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రమైన యడ్లపాడులోని పిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక కంసాలి బావి సెంటర్లో గురువారం బహుముఖ పోటీలు నిర్వహించారు. కుండకొట్టుడు, మ్యూజికల్ ఛైర్స్, లెమన్‌స్పూన్, ఉండమ్మా బొట్టు పెడతా తదితర పోటీల్లో పిల్లలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సినీ నటులు ముత్తవరపు పద్మారావు, సురేష్‌బాబు, శంకర్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను ఎం.భరధ్వాజ్, పి.కృష్ణతేజ, ఎన్.జగదీష్, ఎం.తరుణ్, ఎం.ఆకాష్, ఎన్.హేమంత్, ఎన్.కాళిదాసు సమన్వయం చేశారు. బహుమతులు సాధించిన వారిలో పి.రూపశ్రీ, సృజన, మన్విత్, శ్రీరాం, సహస్ర, నిహారిక, భార్గవి, మూజికల్ చైర్స్‌లో భవానీ, శ్రీను, గోవర్ధని ఉన్నారు.



జీవో 1 రద్దు కోసం ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ

భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధంగా తెచ్చిన చీకటి జీవో 1ను రద్దు చేయాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో గురువారం ధర్నా చేశారు. ఎఐటియుసి ఏరియా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోజురోజుకూ ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటున్నారని అన్నారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు రోడ్లపైనే ర్యాలీలు, విజయోత్సవాలు గుంపులు గుంపులుగా చేసుకుంటున్నారని, మరోవైపు ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల నిరసనలను అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. చీకటి జీవోను ఉపసంహరించకుంటే తగిన గుణపాఠం తప్పదన్నారు. ధర్నాలో వందనం, డి.మార్కు, పి.వెంకటేశ్వర్లు, ఎస్.దావీదు, కె.మల్లికార్జున, ముసలయ్య, పేరయ్య పాల్గొన్నారు.

అలవాలలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలోని అలవాలలోని పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు సంప్రదాయ దుస్తుల్లో అలరించగా హరిదాసు వేషాలు, భోగిమంటలు, చిన్నపిల్లలకు తల్లులచే భోగిపళ్ల, బొమ్మలకొలువు, ముగ్గుల పోటీలు, గాలిపటాల పోటీలతో చిన్నారులు సందడి చేశారు. వివిధ పోటీల్లో విజేతలకు హెచ్‌ఎం కె.స్వర్ణలత బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పి.వి.భీష్మరావు, ఎ.నాగమల్లేశ్వరి, జి.వెంకటేశ్వరరావు, వై.శైలజ పాల్గొన్నారు.

ఎ.ముప్పాళ్లలో రేపు రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ఈపూరు

సంక్రాంతి సందర్భంగా మండలంలోని ఎ.ముప్పాళ్లలో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు ఈనెల 14వ తేదీన నిర్వహిస్తామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు గురువారం తెలిపారు. చుక్కల, గీతల, చుక్కల (లోకల్) ముగ్గుల్లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలతోపాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

పేదలకు నేటికీ కలగానే ఇల్లు



అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణం శివారు ప్రాంతాల్లో ఏడేళ్ల కిందట గత ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణాలు పేదలకు ఇప్పటికీ దక్కలేదని సిపిఎం నాయకులు విమర్శించారు. ఆ ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని, నివాసయోగ్యంగా లేవంటూ చెబుతున్న ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లుగా పూర్తి చేయకుండా జాప్యం చేస్తోందని అన్నారు. ఈ మేరకు ఆ ప్రాంతాన్ని సిపిఎం బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇళ్ల కోసం రూ.500 నుండి రూ.25 వేల వరకూ జనం డిపాజిట్లుగా చెల్లించారని, అవి పూర్తి చేసి తమకు ఇస్తారేమోనని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేసి ఇస్తామని హామీనిచ్చిన వైసిపి ఇప్పుడు విస్మరించిందని అన్నారు. పనులు కొన్ని ప్రారంభించినా డ్రెయినేజీ, విద్యుత్, నీటి సదుపాయం వంటి వాటిని విస్మరించిందని తెలిపారు. పైగా లబ్ధిదార్లు రూ3.5 లక్షల నుండి రూ.15 లక్షల వరకూ చెల్లించాలని చెబుతున్నారని, ఇది అసాధ్యమని భావించిన పేదలు తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నారని చెప్పారు. జగన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణం అంటున్న ప్రభుత్వం ఒక్కో ఇంటికి ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మాత్రమూ సరిపోవడం లేదని, దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం తమ వల్లకాదంటూ జనం చేతులెత్తేస్తున్నారని, చాలా గ్రామాల్లో పునాది దశలోనే పనులు నిలిచాయని అన్నారు. పైగా ఇళ్ల నిర్మించుకోకుంటే స్థలాన్ని వెనక్కు తీసుకుంటామని బెదిరింపులు దారుణమన్నారు. పరిశీలనలో సిపిఎం మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, నాయకులు బి.నాగేశ్వరరావు, డి.వెంకటేశ్వర్లు, జి.కోటేశ్వరరావు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

16 వరకు సంక్రాంతి సంబరాలు : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



కలెక్టర్ శివశంకర్

సంక్రాంతి సందర్భంగా పల్నాడు జిల్లాలో ఈనెల 12-16 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. ఈ మేరకు వివరాలను గురువారం వెల్లడించారు. గురువారం సాయంత్రం జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని మల్లమ్మ సెంటర్ వద్ద నుంచి గడియార స్తంభం వరకు భారీ ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జిల్లా క్రీడా ప్రాతికార సంస్థ స్టేడియం (డిఎస్ఎ)లో జబర్ దస్త్ టీం సంక్రాంతి సంబరాల వేడుకలు జరుగుతాయని, 14వ తేదీ ఉదయం 6 గంటలకు గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న బ్రహ్మానందరెడ్డి కాంప్లెక్స్ దగ్గర భోగి మంటల నిర్వహణ ఉంటుందని, అదే రోజు 8 గంటలకు పూర్ణ కుంభం, గంగిరెద్దు చెరుకు గడలుతో ఊరేగింపు ఉంటాయని తెలిపారు. ఉదయం 9 గంటలకు డిఎస్-ఎలో జిల్లా క్రీడల నిర్వహణ, పొంగలి, చిన్నారులకు బోగి పళ్లతో ఆశీర్వాదాలు, బొమ్మల కొలువు, సుందరీ కరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం మహిళాలకు ముగ్గులు పోటీలు, సాయంత్రం 5 గంటలకు ప్రముఖ గాయిని, గాయకులు సునీత, దీపు బృందం ద్వారా సంగీత విభావరి నిర్వహిస్తామని, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఇండియన్ లెజండరీ సింగర్ మాల్గాడి శుభచే ప్రత్యేక సంగీత విభావరి ఉంటాయన్నారు. 8 గంటలకు ఒడిస్సా వారిచే పైక నత్య ప్రదర్శన, ఈజిప్ట్ వారి తరహ ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు సంప్రదాయ దుస్తుల ప్రదర్శన పోటీ, లోకల్ టాలెంట్ వారిచే ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని, 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రముఖ సిని, మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి ద్వారా మిమిక్రి ప్రదర్శన, 7 గంటలకు ప్రముఖ సిని గాయకుడు సింహాతో సంగీత విభావరి, 8 గంటలకు జబర్ దస్తు టీం, రాజమౌళితో ప్రత్యేక ప్రదర్శన ఉంటాయని వివరించారు. వేడుకల్లో అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ సంబరాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.

రైతులకు 33 పైసల వడ్డీకే రుణాలు

- హామీ ఏమీ లేకుండానే యంత్రాలు, గేదెల కొనుగోలుకూ..
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలపై అవగాహన

ప్రజాశక్తి - దుర్గి



బ్రాంచ్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు

రైతులకు 33 పైసల వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు దుర్గి బ్రాంచ్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని శ్యామరాజుపుంలో 'రైతులతో రాత్రి' శిబిరం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బ్రాంచ్‌లో 26 వేల ఖాతాదార్లున్నారని, రూ.110 కోట్ల టర్నోవర్ జరుగుతోందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు హామీ లేకుండానే 33 పైసల వడ్డీతో రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని ఏడాదిలోగా చెల్లిస్తే మరింత రుణాన్ని అంతే వడ్డీకి ఇస్తామన్నారు. ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు 50 పైసలు వడ్డీతో రైతులకు హామీ లేకుండా ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. గేదెలు, గొర్రెలు, గేదెలకు కావలసిన దాణాకు రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రుణాలిస్తామని, దీనికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. రైతులకు వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. దుర్గి బ్రాంచ్ రూ.120 కోట్లతో వ్యాపార నడుస్తోందన్నారు. దుర్గి బ్రాంచ్ పరిధిలో 270 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయని, 2,700 మందికి రూ.11 కోట్ల రుణాలు రెండు నెలల క్రితం మంజూరు చేశామని తెలిపారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణాలపై రాంబాబు కళాజాత బృందం సభ్యులు మాగులూరి రాంబాబు, పులిమెల భాస్కరరావు, యలకపాటి శ్రీనివాసరావు పాటలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్రెడిట్ చీఫ్ మేనేజర్ బి.రాము, ఫీల్డ్ ఆఫీసర్ జె.అరుణ్ కుమార్ గౌడ్, వెటర్నరీ డాక్టర్ దిలీప్, వైఎస్ఆర్ క్రాంతి పథం సిసి చంద్రయ్య, సర్పంచ్ ఆర్.రామచంద్రయ్య, ఎంపిటిసి ఎం.మల్లికార్జునరావు, ఆదర్శ రైతు వెంగళరావు, విఒఎ ఎం.లీలావతి పాల్గొన్నారు.



పేదలకు పండగ సంతోషాన్ని దూరం చేసిన వైసిపి : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పేదలంతా పండగలను సంతోషంగా చేసుకునేలా టిడిపి హయాంలో క్రిస్మస్, రంజాన్, సంక్రాంతికి కానుకలు అందించామని, వైసిపి పాలనలో సామాన్యులు పండగలు సరిగా చేసుకునే పరిస్థితి లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జివి ఆంజనేయులు విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక పథకాలను రద్దు చేసి పేదలకు అన్యాయం చేసిందని, సంక్రాంతి వస్తున్నా ఏ ఒక్క కుటుంబంలోనూ ఆనందం లేదని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులను నిలిపేశారని, పేదలకు పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను మూసివేశారని దుయ్యబట్టారు. టిడిపి హయాంలో లక్షల సంఖ్యలో పేదలకు ఇళ్లు నిర్మించామని, వైసిపి హయాంలో ఒక్క ఇల్లు కట్టి జగనన్న కాలనీ అని పేరు పెట్టుకుంటున్నారని ఎద్దేవ చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అయితే కేసుల భయంతో బయటకు రావడం లేదని, ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ధారునాయక్, ఎం.శివప్రసాద్, జి.జనార్దన్‌బాబు, జి.నాగపూర్ణచంద్రరావు, ఆర్.జగ్గారావు, కె.వీరరాఘవులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లోని అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ బి.అరుణ గురువారం తెలిపారు. బొల్లాపల్లి మండలం గుట్లపల్లి, జయంతి రామాపురం, రేమెడిచర్ల గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్త పోస్టు, బొల్లాపల్లి మండలంలోని దోమలగుండం, లాలిపురం, రెడ్డిపాలెం, చక్రాయపాలెం, పేరూరుపాడు, ఈపూరు మండలంలోని అగ్నిగుండాల, చిట్టాపురం, ఈపూరు, బొమ్మరాజుపల్లి, కొండ్రముట్ల గ్రామాలల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అభ్యర్థులు స్థానిక వివాహిత మహిళలై ఉండాలని, కార్యకర్త పోస్టుకు పదో తరగతి, సహాయకుల పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసే నాటికి 21-35 ఏళ్లలోపు వారై ఉండాలని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 24 వ తేదీలోగా ఈపూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

జగనన్న గృహాలకు సాయం పెంచాలి

సిపిఎం బృందం ముందు బాధితుల గోడు



కొల్లిపరలో మండలంలో జగనన్న కాలనీ పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - తెనాలిరూరల్, కొల్లిపర

జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలకు కనీసం రూ. 5 లక్షలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.భవన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెనాలి, కొల్లిపర మండలాల్లోని జగనన్న కాలనీలను సిపిఎం బృందం నేతలు పరిశీలించారు. తెనాలి అయితానగర్ గోలీ డొంక ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీ, అలాగే కొల్లిపర మండలంలోని దావులూరు, శివలూరులో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్భావన్నా రాయణ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సాయం ఏ మాత్రం చాలదన్నారు. లోతట్టు పొలాలలో స్థలాలను కేటాయించాలని, దానికి మెరకలు తోలించేందుకే రూ.లక్ష ఖర్చవుతుందన్నారు. ఆ కారణం తోనే నిర్మాణాలలో కూడా పురోగతి దయనీయంగా ఉందన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు కనీసం రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, జిలుగు ముక్కంటి, కె.రవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ మండలం ఆత్మకూరు గ్రామంలో జగనన్న కాలనీని సిపిఎం బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా కాలనీవాసులు అనేక సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా ప్రభుత్వం ఇచ్చే డబ్బులు పునాదికి కూడా చాలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో 316 ప్లాట్లు వేస్తే 250 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారని వీరిలో 125 మంది ఇంకా ప్రారంభించలేదని, కొన్ని బేస్ మట్టం లెవెల్ ఆగిపోయాయని తెలిపారు. కాలనీలోకి రావడానికి మూడు కిలోమీటర్ల దూరం రోడ్డు లేక సాయంత్రం ఐదు గంటలు దాటితే మహిళలు భయపడుతూ బిక్కుబిక్కుమంటూ రావాల్సిన పరిస్థితి ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో ప్రమాదకరమైన పాములు, తేళ్లతో సావాసం చేయాల్సి వస్తుందని



ఆత్మకూరులో జగనన్న కాలనీ పరిశీలిస్తున్న నాయకులు

తెలిపారు. అలాగే సైడ్ కాల్వలు లేక నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఇళ్లల్లో వాడుకున్న నీళ్లు కూడా రోడ్ల మీదకు వస్తున్నాయని తెలిపారు. తాడేపల్లిలో అన్ని సౌకర్యాలతో నివాసం ఉండేవారమని ముఖ్యమంత్రి నివాసం కోసం మమ్మల్ని లేపేసి ఇక్కడ ఇచ్చారని ఇక్కడ సౌకర్యాలు లేవని వారు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ జగనన్న కాలనీకి వెంటనే రోడ్లు వేసి, వీధిలైట్లు వేయాలని అలాగే సైడ్ కాలువలు కూడా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కొంతమందికి బిల్లులు రాలేదని వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ఆత్మకూరు గ్రామ కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, చేనేత కార్మిక సంఘం నాయకులు చిట్టేల సీతారామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గడ్డం అజయ్ కుమార్, బిట్రా రాంబాబు, గుద్దంటి కష్ణారావు, వద్ది సుబ్రహ్మణ్యం, డి. పద్మనాభ శర్మ, ఆనందం బాబ్జి, వద్ది సురేషు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభిమాని సయ్యద్ అబ్బాస్ కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



సిపిఎం పార్టీ గుండిమెడ గ్రామ శాఖ మాజీ సభ్యులు, సయ్యద్ అబ్బాస్ (81) గురువారం ఉదయం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం ఉదయం అబ్బాస్ పెద్ద కుమారుడు సయ్యద్ నాగుల్ మీరా నివాసంలో కన్నుమూశారు. అబ్బాస్ మృతి వార్త తెలుసుకున్న సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి ఎంటి ఎంసీ పరిధిలోని గుండి మెడ గ్రామంలో అబ్బాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి , ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మొదటినుండి సిపిఎం కార్యక్రమాల పట్ల ఆకర్షితుడై, గుండి మెడ శాఖలో కొంతకాలం క్రియాశీలక సభ్యునిగా పనిచేశారని వెంకటరెడ్డి గుర్తు చేసుకున్నారు. అబ్బాస్ భౌతికాయాన్ని సందర్శించిన వారిలో సిపిఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, గ్రామ శాఖ కార్యదర్శి నాగ పోగు విజయరాజు, వ్యకాస తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను తదితరులున్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి



తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం నివాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని స్థానికులు సిపిఎం నాయకులముందు తమ సమస్యలను వివరించారు. ఏళ్లతరబడి నివాసముంటున్న రోడ్లు, సైడు కాల్వలు కూడా లేవని,తమ సమస్యలను అధికారులు, ప్రభుత్వం పట్టించు కోలేదని తెలిపారు. సర్వేలో బ్రహ్మానందపురం శాఖ కార్యదర్శి ఇ నరసింహారావు, సహాయ కార్యదర్శి ఎస్ దుర్గారావు, వి శాస్త్రీ పాల్గొన్నారు.

మురుగుతో సావాసం.. దోమల స్వైరవిహారం..

ప్రజాశక్తి-తాడేపల్లి :





తమ ఇళ్ల ముందు మురుగు పోవడానికి కాల్వలు లేవు. ఫలితంగా ఇళ్ల ముందే పెద్దఎత్తున తాము వాడుకున్న నీరు బయటకు పోవడానికి వీల్లేకపోవడంతో మురుగుగా మారి ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారులకు అనేకసార్లు తమ సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా దోమలు వృద్ధి చెంది స్వైరవిహారం చేస్తున్నాయి. అంటురోగాలు ప్రబలుతాయని ఆందోళనగా ఉంది. మీరైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని సిపిఎం బృందం ముంద బాధితులు వాపోయారు. తాడేపల్లి పట్టణంలోని 5వ వార్డు ప్యారీ కంపెనీ ఖాళీ స్థలంలో(ప్రస్తుతం సిఎం హెలీప్యాడ్ పక్కన) పేదలు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్న ప్రాంతంలో గురువారం సిపిఎం నాయకులు సర్వే నిర్వహించారు. మంచినీటి కుళాయి చుట్టూ మురుగునీరు చేరడంతో మంచినీరు కూడా దుర్వాసన వస్తోందని చెప్పారు. సామూహిక మరుగుదొడ్లకు తలుపులకు రిపేర్లు చేయాలని కోరారు. రెండేళ్ల క్రితం ఇళ్ల స్థలం మంజూరైందని ఇచ్చిన హామీపత్రాలు నేటికీ అలాగే మిగిలిపోయాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. సర్వేలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, డివి భాస్కర్‌రెడ్డి, ఎస్.ముత్యాలరావు, బి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉండవల్లి సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లో గురువారం మూడు సార్లుగా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. దీంతో వాహనదారులు పూర్తిగా అసౌకర్యానికి గురయ్యారు. ఉండవల్లి సెంటర్, అమరావతి రోడ్డు వైపు, మంగళగిరి వైపు, విజయవాడ స్ర్యూబ్రిడ్జి దాటి కెఎల్ రావు కాలనీ వైపు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. అనేక మంది విఐపిలు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ట్రాఫిక్ క్లియర్ చేయడానికి రెండు గంటల సమయం పట్టింది. పండుగ సందర్భంగా పిల్లలతో సొంత ఊళ్లకు వెళ్లే వాళ్లు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎట్టకేలకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఆయుర్వేద పరిషత్, సురక్షా అకాడమీ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆరోగ్య సంబరాలు సురాక్షా అకాడమీ ఆయుర్వేద యోగ ప్రాంగణం లో గురువారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి.వివిధ రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ ఎంప్లాయిమెంట్ డిపార్టుమెంట్ హిమబిందు, విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరి హరిత, డాక్టర్ పూర్ణ రాజేశ్వరి పాల్గొన్నారు.





కాజాలో ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

డివైఎఫ్ఐ మహిళా సంఘం ఐద్వా ల సంయుక్త ఆధ్వర్యంలో కాజలో సింహాద్రి బసవ పున్నయ్య, అప్పికట్ల శ్రీనివాసరావు మాస్టర్ సంక్రాంతి ఆటల పోటీలను గురువారం ఆర్తుల సూర్యనారాయణ క్రీడా ప్రాంగణంలో షటిల్ పోటీలను డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కృష్ణ కాంత్, హై స్కూల్ పిడి డి. భాస్కరరావు ప్రారంభించారు. నాలుగు రోజులపాటు ఈ ఆటల పోటీలు జరగనున్నాయని సంఘ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సంక్రాంలతి సందర్భంగా యువత పెడధోరణుల వైపు మరలకుండా ఉండేందుకు ఇటువంటి పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు బొమ్ము త్రికేష్ రెడ్డి, ఆర్ధల సాంబశివరావు, ఆది శేఖర్, బి. కోటేశ్వరి, అప్పికట్ల ప్రకాశరావు, కారుమూరు మాధవరెడ్డి, సింహాద్రి సుమ, ఆర్ధల శ్యామల జ్యోతి, అవుతు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం

19న ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీలకు పెండింగ్ జీతాలు, సెంటరు అద్దెలు, ఇతర బిల్లులు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఈనెల 19 అన్ని ప్రాజెక్టు కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ తెలిపారు. గురువారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.రమాసుష్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దీప్తి మనోజ మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ నెలల జీతాలు ఇంత వరకూ ఇంత వరకూ విడుదల చేయలేదన్నారు. అలాగే అక్టోబర్ నుండి సెంటర్ అద్దెలు, కొన్ని ప్రాజెక్టుల్లో ఇతర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అంగన్వాడీలు ఎంతో శ్రమకోర్చి పేద ప్రజలు, మహిళలు, పిల్లలకు సేవ చేస్తున్నారని, అటువంటి వారికి నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటే వారి కుటుంబాలు ఎలా జీవించాలని ప్రశించారు. మరోవైపు డిసెంబర్ కూడా సగంలోకి వచ్చిందని, సంక్రాంతి పండుగ దగ్గరికి వస్తుందని చేతిలో డబ్బులు లేక అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న దీప్తి మనోజ , వేదికపైన వై నేతాజీ, రమాసుష్మ

ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇటీవల రాష్ట్ర అధికారుల వద్ద జీతాల బకాయిల విషయం ప్రస్తావించినప్పుడు బడ్జెట్ లేదని సమాధానం ఇవ్వటం అన్యాయమన్నారు. అంగన్వాడీలు ప్రతి నెలా వారి జీతం నుండి సెంటర్ వారి జీతం నుండి సెంటర్ అద్దెలు చెల్లిస్తున్నారని, తర్వాత ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అయితే అయితే రెండు నెలల జీతాలు, మూడు నెలల సెంటర్ అద్దెలు బకాయిలు ఉండటంతో సెంటర్ల నిర్వహణ, కుటుంబ నిర్వహణ కూడా కష్టంగా మారిందని తెలిపారు. కొన్ని ప్రాజెక్టుల్లో కూరగాయలు, పప్పు దినుసుల బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించలేదన్నారు. ఈ నేపథ్యంలో బకాయిల విడుదల కోరుతూ ప్రాజెక్టుల కార్యాలయాల వద్ద జరిగే నిరసనల్లో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే పెండింగ్‌లో ఉన్న మినీ సెంటర్ల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలని, వాటిల్లో పనిచేస్తున్న మినీ సెంటర్ వర్కర్లను మెయిన్ సెంటర్ వర్కర్‌గా మార్చి హెల్పర్లను కొత్తగా నియమించాలని అన్నారు. చాలా కేంద్రాలలో మౌలిక వసతుల కొరత ఉందన్నారు. మంచినీరు, మరుగుదొడ్లు, కాంపౌండ్‌వాల్స్, విద్యుత్తు, వంట పాత్రలు తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆయా సెంటర్ల లబ్ధిదారులతో సంతకాలు సేకరించి వినతి పత్రాలు సమర్పించే కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ తదితరులు మాట్లాడారు.



'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ప్రజాశక్తి - వినుకొండ

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు పల్లపు శివ, ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జాషువా కళా ప్రాంగణంలో గురు వారం వడ్డెర యువ గర్జనను పురస్కరించుకొని సమావేశం నిర్వహించారు. వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతి నిధి వేముల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు పల్లపు శివ హాజరయ్యారు. అనం తరం ఆయన మాట్లాడారు. వడ్డెర సంఘం వినుకొండ నియోజకవర్గ అధ్యక్షులుగా వేముల లక్ష్మణ్ ను,పట్టణ అధ్య క్షులుగా తమ్మిశెట్టి వెంకటేశ్వరరావును, మరి కొంత మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించి, పత్రాలను అందజేశారు. అనంతరం సభ్యులను సన్మానించారు.



నాగులవరం.. బీమా గ్రామం..

ప్రజాశక్తి - వినుకొండ

ఎల్ఐసి నాగులవరంను 2020-21 ఆర్థిక సంవ త్సరానికి బీమా గ్రామంగా ప్రకటించి లక్ష రూపాయల చెక్ ను ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ లక్ష్మనాయక్ చేతుల మీదుగా సర్పంచ్ నూనె కోటేశ్వరరావుకు గురువారం అంద జేశారు. ఎల్ఐసి మేనేజర్ మాట్లాడుతూ ఒక ఆర్థిక సంవత్స రంలో ఒక గ్రామంలో 100 పాలసీలను చేస్తే, ఆగ్రామాన్ని బీమా గ్రామంగా ప్రకటిస్తామని చెప్పారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరుగుతుందని తెలి పారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ సొమ్మును ప్రజల దాహార్తిని తీర్చేందుకు వినియోగిస్తా మన్నారు. గ్రామంలో బోర్ వేయించి, మోటా రును బిగిస్తామని, బిగిం చనున్నట్లు చెప్పారు. గ్రామానికి అవార్డు రావడానికి కారణ మైన ఎం.రమణారెడ్డి, జి.ఏడుకొండలరెడ్డి, సిహెచ్ దానవ రెడ్డి, పాల్గొన్నారు.



దేశ సమైక్యతకు పాటుపడాలి

ప్రజాశక్తి - వినుకొండ

క్రైస్తవులంతా సంఘటితం కావాలని, దేశ సమైక్యతకు పాటుపడుతూ క్రైస్తవులపై జరుగుతున్న అన్యాయాలను ఎదు ర్కొని పరిష్కార దిశగా పయ నించాలని ఎఐసిసి ఫౌండర్ రెవరెండ్ హనోక్ అన్నారు. అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) నూతన కమిటీ సభ్యులను గురు వారం సన్మానించారు. స్థానిక ఇందిరానగర్ లోని చర్చి లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్య క్షులు రెవరెండ్ డి.శామ్యూల్ కృపాకర్ అధ్యక్షతన సన్మానించారు.దళిత క్రైస్తవులందరూ ఐక మత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు. నియోజకవర్గంలో ఏవైనా సమస్యలు ఉంటే కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ నెల 10న విజయవాడలో ఎఐ సిసి జాతీయ, రాష్ట్ర స్థాయి కోర్ కమిటీ సమావేశం నిర్వ హించారు. పల్నాడు జిల్లా అధ్యక్షులుగా రెవరెండ్ హైడ్ రాజు, పొలి టికల్ వింగ్ జిల్లా అధ్యక్షులుగా రెవరెండ్ రెడ్డి బోయిన ప్రసన్నకుమార్, నియోజకవర్గ అధ్యక్షులుగా రెవ రెండ్ నంబుల ప్రేమనిధి, కార్యదర్శిగా పాస్టర్ రెడ్డిబోయిన గాంధీనీ ఏకగ్రీవంగా నియమించారు.

జీతాలు రాక.. ఉద్యోగ భద్రత లేక..!

చిలకలూరిపేట 108, 104 సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కొవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి, అలుపెరగక వైద్య సేవ లందించిన ఫ్రంట్ లైన్ వారియర్స్, 108, 104 అంబులెన్స్ ఉద్యోగస్తులకు సరైన సమయానికి జీతాలు రాకుండా, ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. చాలిచాలని జీతాలతో నెట్టుకొస్తున్న తమకు ఆ జాతాలు కూడా సరైన సమయంలో ఇవ్వడం లేదని చెబుతున్నారు. పట్టణంలో 108 వాహనం ఒకటి, 104 వాహనం ఒకటి ఉన్నాయి. ,మండలానికి ఒక్కొక్కటి చొప్పున నియోజ కవర్గంలో మొత్తం 6 అంబులెన్స్ వాహ నాలు ఉన్నాయి. వీటిల్లో 108 లో 14 మంది సిబ్బంది, 104 లో 9 మంది సిబ్బం దితో కలిపి మొత్తం 23 మంది ఉన్నారు. వీరిలో ముగ్గురు మహిళలు. సెల వులు ఉండవు. ప్రత్యేక రోజుల్లో కూడా ఇదే పరి స్థితి. ఆయా వాహనాల్లో మెడికల్ కిట్లు, డ్రెస్సింగ్ ప్యాడ్స్, గ్లౌజులు,గాజు రో ల్స్, మాస్కులు మొదలైనవి సరైన సమ యంలో అందడంలేదని, ఎప్పుడు అరకొం గానే ఉంటున్నట్లు చెప్పారు.

ఈ వాహనాలు ప్రభుత్వ అధీనంలోనే ఉన్నప్పటికీ జీతాలు మాత్రం అరవింద మెడికల్ ఎమర్జెన్సీ సర్వీసు నుంచి తమకు వస్తున్నట్లు చెప్పారు. మరీ దారుణంగా ఈఎస్ఐ, పిఎఫ్‌లకు సంబంధించిన డబ్బులు మొత్తం కూడా తమ జీతాల్లోనే తగ్గిస్తున్నారని అంటున్నారు.

టెక్నీషియన్, డ్రైవర్లకు సర్వీస్‌లతో లింకు పెట్టి జీతంలో కోత పెట్టడం అన్యాయమని సిబ్బంది చెబు తున్నారు. పేరుకే 12 గంటల విధులు కాని వెట్టి చాకిరి చేయిస్తున్నారని సిబ్బంది వాపో తున్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా చేస్తామంటూ ముఖ్యమంత్రి చెప్పిన మాట లు నీటిమూటలయ్యాయయని వాపో తున్నారు. తమను ఔట్‌సోర్సింగ్ ఉద్యో గులుగా అయినా చేర్చాలని వారు కోరు తున్నారు. ఎమర్జెన్సీ అంబులెన్స్ వాహ నాలను రాత్రి సమయాల్లో ఎక్కడ నిలుప



కోవాలో తెలియక వారు సతమత మౌతు న్నారు. వాహ నాలను స్థానిక స్వచ్ఛంద సంస్థ అసిస్ట్ సంస్థలో పెడు తున్నట్లు, యడ్ల పాడుకు సంబంధించి 108 వాహ నాన్ని తిమ్మాపురంలోని కల్పతరువు స్పిన్నింగ్ మిల్స్ వద్ద, నాదెండ్లలోని రెండు వాహనాలను అక్కడి ప్రభుత్వాసుపత్రిలో పెడు తున్నట్లు సమా చారం. ఆయా వాహ నాలను ఉంచేందుకు సరైన స్థలం,షెడ్లు లేవు.

శాశ్వత ఉద్యోగులుగా మార్చాలి

104,108 లలో పని చేసే వారిని వెంటనే శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని, జీతా లు ప్రైవేట్ సంస్థ నుంచి కాకుండా ప్రభుత్వమే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పేరుబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అంతే కాకుండా రిలీవర్స్‌ను పెంచాలని, వాహనానికి పంచర్లు, ట్రాఫిక్ జామ్ మొదలైన వాటికి సంబంధించి పనిష్మెంట్లు ఇవ్వ రాదని, మహిళల ఉద్యోగులకు ప్రత్యేక సమయాల్లో, గర్భిణిలకు సెలవులు ఇవ్వాలని, అదే సమయంలో వారికి జీతాలు తగ్గించ కుండా పూర్తిగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.



సీఎం సహాయ నిధి నుండి రూ.13.61 లక్షలు సాయం

ప్రజాశక్తి-వినుకొండ

నియోజకవర్గంలోని ఎనిమిది మంది బాధితులకు సీఎం సహాయనిధి నుండి రూ.13.61 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తన కార్యాలయంలో బాధితులకు ఈ చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గుండ్లకమ్మ నదిలో ప్రమాదవశాత్తు జారిపడి చని పోయిన వారి కుటుంబానికి సీఎం సహాయనిధి నుండి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయిం చుకోలేని బాధితులకు ఈ సహాయనిధి నుండి అందజేయడం జరిగిం దన్నారు. వినుకొండలో బాధితుల కుటుంబాలకు రూ.6 లక్షలు, నూజెండ్ల మండలంలో రూ.5.80 లక్షలు, శావల్యాపురంలో రూ.1.65 లక్షలు, బొల్లాపల్లిలో రూ.16 వేలు.. మొత్తం 13 లక్షల 61 వేల రూపాయలు అందజేసినట్లు వివరించారు.

వైకుంఠపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి-అమరావతి



మండలపరిధిలోని వైకుంఠపురం గ్రామ సచివాలయంలో 104 ఫ్యామిలీ ఫిజీషియన్ కార్య క్రమం గురువారం జరిగింది. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అలాగే, వైద్య సిబ్బందితో కలిసి ఇంటి వద్దకే వెళ్లి ప్రతి రోగికి, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ డి వి శివరత్నకుమార్, డాక్టర్ నవీన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఓఇ రాకేష్, డిఎ ప్రతాప్, ఎఎన్ఎం భవిత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



అమరావతి మ్యూజియంను సందర్శించిన మహేష్

ప్రజాశక్తి - అమరావతి

చెన్నయ్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తి గతేడాది జనవరి చివరి వారం నుంచి దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ చారిత్రక ప్రదేశాలను సం దర్శిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మం డల కేంద్రమైన అమరావతిలోని మ్యూజి యంను సందర్శించారు. చరిత్ర, అక్కడున్న వస్తువుల వివరాలను ఆయనుకు మ్యూజియం ఇన్‌ఛార్జి చిన్నబాబు వివరించారు. మరో వారంలో తాను చెన్నయ్‌కు చేరుకుంటానని మహేష్ తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళులు

ప్రజాశక్తి-ఈపూరు


మండల కేంద్రమైన ఈపూరు శాఖ గ్రంథాలయంలో స్వామి వివేకానంద 160వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రం థాలయ నిర్వాహకులు గంటా శ్రీనివాస రావు, వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథా లయంలోని స్వామి వివేకానంద పుస్తకాలను విద్యార్థుల ముందు ప్రదర్శనగా ఉంచారు. వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. **చిలకలూరిపేట:** పట్టణంలోని శాఖా గ్రం థాలయంలో వివేకానంద జయంతి కార్య క్రమం జరిగింది. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్య క్షులు డా.పి.వి. సుబ్బారావు



ఈపూరులో...

వివేకా నంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. **అమరావతి:** మండల కేంద్రమైన అమరావతిలో శ్రీ శిశు మందిర్ నిర్వాహకులు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివా ళులర్పించారు. అమరావతిలో స్వామి వివేకానందుని శోభా యాత్రను నిర్వ హించారు.

పాఠశాల సమితి అధ్య క్షుడు పులిపాటి పవన్ కుమార్, అమరావతి మండల బిజెపి అధ్యక్షులు కోలా వెంక టేశ్వరావు, పాఠశాల కార్యదర్శి వారణాసి వెంకటే శ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు. అమరావతిలో జన చైతన్య సమితి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. **తెనాలి:**స్వామి వివేకానంద జయంతి సందర్భంగా స్థానిక నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో 'దర్గా టు దుర్గ' సమైక్యత నడకను ఆ విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



ఇప్పటంలో స్వామి వివేకానందుని నివాళి

ప్రారంభించారు. గుంటూరులోని హజరత్ కాలేషా మస్తాన్ దర్గా నుంచి ప్రారంభమైన నడక విజయ వాడ దుర్గ గుడి వరకు సాగింది. కళాశాల అధ్యాపకేతర సిబ్బంది నంబూరి మణి కుమార్ అల్లూరి సీతారామరాజు వేష ధారణలో నడకలో పాల్గొన్నారు. అధ్యా పకులు,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని దాదాపు 33 కిలోమీటర్ల మేర నడకను విజయవంతం చేశారు. కార్యక్రమంలో కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకాడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎం . కుమారస్వామి పాల్గొన్నారు. **పొన్నూరు రూరల్:** పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో తిరుమలశెట్టి రామస్వామి, లోవ రాజు సహకారంతో వివేకానంద సేవా సమితి చైల్డ్ హాస్టల్‌లో మిక్సర్ గ్రైండర్ అందజేశారు. సమస్త అధ్యక్షులు టి.ఉమా శంకర్, వివేకానంద సేవా సమితి సభ్యులు జి.శ్రీనివాసరావు, వి.ఉదయ్‌కుమార్, కార్య దర్శి జి. పవన్ చక్రవర్తి పాల్గొన్నారు. **తాడేపల్లి రూరల్:** ఎంటిఎంసి పరిధిలోని ఇప్పటంలో స్వామి వివేకానందుని జయంతి నిర్వహించారు. వైసిపి మండల యువజన విభాగం అధ్యక్షులు మున్నంగి వివేకానం దరెడ్డి ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు వివే కానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సచి వాల య కార్యదర్శి ఎంఎల్‌వి ప్రసాద్, వైసిపి నాయకులు లచ్చి తులసీదాస్, లచ్చి వెంక టేశ్వరరావు, ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వివిఐటి విద్యార్థులు, అధ్యాపకుల సమైక్యతా ర్యాలీ

క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా గుంటూరు

- **ఆర్‌టిసి కాలనీలో పార్క్‌ను ప్రారంభించిన నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తి**

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ నగరంగా మార్చడానికి జిఎంసి ప్రత్యేక కృషి చేస్తుందని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. గురువారం ఆర్టీసి కాలనీ 5వ లైన్‌లో రూ.42 లక్షలతో అభివద్ధి చేసిన మున్సిపల్ కార్పోరేషన్ పార్క్‌ను మేయర్, ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి కలిసి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ సుమారు అర ఎకరంలో స్థానికులకు ఆహ్లాదం, ఆరోగ్యం అందించేలా పార్క్ ను అభివద్ధి చేశామన్నారు. ఇదే ప్రాంతంలో త్వరలో స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా పార్క్‌లు ఏర్పాటు చేస్తే సదరు ప్రాంతంలో ప్రజారోగ్య రక్షణకు చర్యలు తీసుకున్నట్లేనన్నారు. నగరంలో పార్క్‌ల అభివద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వివిధ కాలనీల్లో ఉన్న పార్క్‌ల అభివద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గాంధీ పార్కు పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆర్టీసి కాలనీలో నూతనంగా నిర్మించిన పార్కులో గార్డెనింగ్, మొక్కలు, ప్రహరీ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, స్థానిక కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఏ.డి.హెచ్. రామారావు,ఈఈ. కోటేశ్వరరావు, డిఈఈ. కళ్యాణరావు, ఏ.ఈ. సేతుబాబు తదితరులు పాల్గొన్నారు.



పార్క్‌ను ప్రారంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కమిషనర్



క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ

వాలీబాల్, క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- ప్రతిపాడు

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని పోతురాజు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక చిన్న కోండ్రుపాడులోని క్రీడాకారులకు గురువారం వాలీ బాల్ , క్రికెట్‌కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోయిన వెంకట ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెత్తను వేరు చేసి సేకరించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలో ఇంటింటి చెత్త సేకరణ తడి, పొడిగా వేరువేరుగా సేకరించాలని, అందుకుగాను ఇప్పటికే నగరవాసులకు 3 రకాల డస్ట్ బిన్లు అందించామని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. గురువారం జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో ప్రజారోగ్య విభాగ అధికారులతో, జూమ్ ద్వారా శానిటేషన్ కార్యదర్శులతో నగరంలో పారిశుధ్య పనులు, ఇంటింటి చెత్త సేకరణ, ట్రేడ్ లైసెన్స్ లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆర్టీసి కాలనీ, భాష్యం స్కూల్ వద్ద ఎప్పటి నుండో ఉన్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌ని సచివాలయం 4,5,6 కార్యదర్శులు సంయుక్తంగా చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించారి తెలిపి, వారికి అభినందనలు తెలిపారు. కార్యదర్శులు విధుల పట్ల నిబద్ధతతో ఉంటే మంచి మార్పు వస్తుందన్నారు. కొందరు కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎంహెచ్ఓ.డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ.కొండారెడ్డి, డిఈఈ. హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా..

ఇటీవల మరణించిన జిఎంసి ఇంజినీరింగ్ విభాగం కార్మికుని భార్యకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ని కమిషనర్ కీర్తి చేకూరి గురువారం అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు జిఎంసి అండగా ఉంటుందన్నారు. తక్కెల్లపాడు హెడ్‌వాటర్ వర్క్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చిరుమామిళ్ళ రాజారావు ఇటీవల కాలంలో మరణించారని, అతని భార్య సావిత్రికి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్‌ని అందించామని తెలిపారు.

పోలీసు పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని బ్రాడీపేట రెండో లైనులో ఉన్న జివిఆర్ కోచింగ్‌సెంటర్‌లో ఈనెల 14వ తేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకు హాజరు అయ్యే అభ్యర్థులకు ఉచిత సైకాలజీ తరగతులు నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరక్టర్ వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యుష సుబ్బారావు ఉచిత ప్రేరణ తరగతులు నిర్వహించుచున్నట్లు వీరయ్య తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రేరణా తరగతులకు హాజరు కావాలని కోరారు.



హోమియో మందులు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

మండలంలోని ఖాజా గ్రామంలో సింహాద్రి బసవ పున్నయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఐదు సెంటర్లలో ఉచితంగా హోమియో మందులు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డెంగ్యూ, కరోనా రాకుండా ముందస్తుగా హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ, ఐద్వా నేతలతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. సింహాద్రి రాజశేఖర్, నిర్మల, భీమిరెడ్డి కోటేశ్వరి, సమంత పర్యవేక్షించారు



గాయకుడు రాజారావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

'ఎన్‌టిఆర్ రాజకీయ జీవితం మచ్చలేనిది'

ప్రజాశక్తి- తెనాలి రూరల్

ఎన్‌టిఆర్ రాజకీయ జీవితం మచ్చలేనిదని వక్తలు అన్నారు. గురువారం ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో భాగంగా స్థానిక పెన్షనర్స్ హెూమ్‌లో ఎన్టీఆర్ రాజకీయ, నటజీవితం పై చర్చించారు. ముఖ్య వక్తలుగా లక్కరాజు లక్ష్మణరావు, కొడాలి వీర ప్రకాష్ రావు పాల్గొని మాట్లాడారు. అలాగే కళాకారుల సత్కారాలలో భాగంగా పట్టణానికి చెందిన ప్రముఖ గాయకుడు రావూరి రాజారావును సత్కరించారు. కార్యక్రమంలో పిటి అవధాని ఎం. రాఘవరావు ఏ వెంకటేశ్వరరావు టి భాస్కర్, మైనేని నాగభూషణం, బడుగు మోహనరావు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు



ఈశ్వరసాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆయోధ్య రామిరెడ్డి

ప్రజాశక్తి -ఫిరంగిపురం

చిట్టా బాపూజీ రెడ్డి, చిట్టా భరద్వాజా రెడ్డి,ఈశ్వర సాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్లు ఆధ్వర్యంలో డాక్టర్ ఈశ్వరసాయి పదోవ వర్ధంతి సందర్భంగా మండలంలోని సెయింట్ పాల్స్ హై స్కూల్ ఆవరణలో గురువారం కంటి వైద్య శిబిరం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో అన్ని వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిట్టా బాపూజీ రెడ్డి మాట్లాడుతూ ఫిరంగిపురం మండలంలోని 20 గ్రామాలకు సంబంధించిన పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రవాణా ఖర్చులు, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. సుమారు 200 మందికి శంకర్ కంటి ఆసుపత్రి వారిచే కంటి పరీక్షలు నిర్వహించి 15 రోజులలో ఆపరేషన్లు చేయించి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తామని బాపూజీ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , వైద్యులు, జడ్‌పిటిసి డి. కత్తి రేణమ్మ ,ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ సలీం, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



కేలండర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) 2023 నూతన సంవత్సర కేలండర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎన్. రాధ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు, సిఐటియు పొన్నూరు మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్ బాబు, మున్సిపాలిటీ మేనేజర్, హెల్త్ సెక్షన్ యఫ్- 1 గాయత్రి పాల్గొన్నారు.

రహదారిపైకి చేరిన మురుగునీరు



ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మండల పరిధిలోని కాజ గ్రామంలోని వెంకటరెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వెంబడి మురుగు నీరు చేరడంతో వాహన దారులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న డ్రైనేజి పూడుకు పోవడంతో మురుగు నీరు ఏటు పోయే వీలు లేక రోడ్డు పైకి చేరింది. సాధారణంగా ఈ మురుగు నీరు ఊరి మధ్యలోని చెరువులోకి చేరుతుంది. గ్రామంలో ఆక్రమణ దారులు ఇష్టానుసారంగా స్థలాలు కబ్జాలు చేయడమే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు.అలాగే మురుగునీరు వల్ల దోమలు పెరిగి రోగాలబారిన పడుతున్నామని, తాగు నీరు కలుషితమౌతుందని పరిష్కారం చూపాలని చాలాకాలంగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. 10వేల జనాభాతో ఉన్న గ్రామంలో పన్నుల రూపంలో కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా డ్రైనేజీ ఏర్పాటుకు చేస్తున్న ప్రయత్నాలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు చర్యలు తీసుకోని డ్రైనేజి వ్యవస్థను పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'లోకేష్ పాదయాత్రకు సంఘీభావం తెలపండి'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: యువనేత నారా లోకేష్ చేపట్టబోతున్న 'యువగళం' పాదయాత్రకు సంఘీభావం తెలపాలని జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ అన్నారు. గురువారం సాయి కృష్ణ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల అధ్యక్ష కాద్యదర్సులతో కలిసి గుంటూరులోని రింగురోడ్డు నుంచి అమరావతి రోడ్డు లాడ్జి సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 400 రోజుల పాటు 4000 కిలోమీటర్ల మేర లోకేష్ మహాపాదయాత్ర జరుగు తుందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు కదలి రావాలని కోరారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్. శ్రీని వాసరావు, జిల్లా తెలుగుమహిళా అధ్యక్షురాలు ఎ. జయ లక్ష్మి, జిల్లా తెలుగు రైతు అద్యక్షులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు వేమూరి మైనర్ బాబు,జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ ఘని, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుకులు షేక్ ఫిరోజ్ పాల్గొన్నారు.



టి షర్టులు పంపినీ చేస్తున్న డాక్టర్ పవని ప్రియాంక

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి:పట్టణానికి చెందిన హ్యాపి మల్టిస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్యర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈనెల క్రీడాకారులకు టి షర్టులు పంపిణీ చేశారు. వీరంతా ఈనెల 14 నుంచి స్థానిక తాలూకా జూనియర్ కళాశాల్లో ప్రారంభం కాబోయే టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. ఆసుపత్రి అధినేత, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పవని ప్రయాంక ఆధ్వర్యంలో జిరిగిన కార్యక్రమంలో జిల్లా యువజన క్రికెట్ అసోసియేషన్, టిపిఎల్ టీమ్ మాలిక్, కెప్టెన్ మధు బృందానికి టి షర్టుల అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి ప్రాంత ఖ్యాతికి చిహ్నంగా క్రీడాకారులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిమని, సిబ్బంది ఉదయభాస్కర్, పిఆర్‌వో సురేంద్ర, శివనందు, సాంబయ్య పాల్గొన్నారు.

ఫార్మా క్రికెట్ చాంఫియన్స్ విజేత 'నిప్స్'



విజేతలకు బహుమతి అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

ఫార్మా క్రికెట్ చాంపియన్స్ టౌర్నమెంట్ జాతీయ స్థాయి క్రికెట్ ట్రోఫీని నిప్స్ ఫార్మసీ కళాశాల జట్టు గెలుపొందింది. విజ్ఞాన్ ఫార్మసీ కాలేజి రన్నరప్‌గా నిలిచింది. వడ్లమూడిలోని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో గురువారం జాతీయ స్థాయి పోటీల క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం గెలుపొందిన జట్ల సభ్యులకు ట్రోఫీలు అందాంచారు. టోర్నీలో ఉత్తమంగా రాణించిన క్రీడాకారులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

నత్తనడకన ఇళ్ల నిర్మాణం

- బొంతపాడు జనన్న కాలనీని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలోని పేద ప్రజలకు బొంతపాడు పరిధిలో జగనన్న కాలనీలోని స్థలాలను సిపిఎం నగర బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రచారం చేస్తుందని, కానీ క్షేత్ర స్థాయిలో చూస్తే ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుందన్నారు. ఇళ్ళ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించట్లేదని అన్నారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం ఇస్తున్న మొత్తం రూ.1,80,000లు సరిపోవని, కనీసం రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. నిదానంగా ఇళ్ల నిర్మాణాలు చేస్తే ఏళ్ల తరబడి పేదలు అద్దె ఇళ్లలోనే ఉండాల్సి వస్తుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మించి పేదలకు అప్పగించటానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యత పాటించే విధంగా చూడాలన్నారు. లేని ఎడల లబ్దిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని నళినీకాంత్ హెచ్చరించారు. జగనన్న కాలనీని సందర్శించిన సిపియం బృందంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్.ఖాసిం షహీద్, ఆది నికల్సన్, నాయకులు షేక్.మస్తాన్‌వలి, టి.శ్రీనివాసరావు, షేక్.భాషా తదితరులున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ కార్యవర్గం

మిర్చి రైతులు, వ్యాపారులకు చేయూత : అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ దిగుమతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం మిర్చి యార్డులో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు, వ్యాపారుల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత మూడున్నర ఏళ్లుగా మిర్చి యార్డులో ఎటువంటి వివాదాలు లేవని, రైతులు, వ్యాపారులు ఇరువురూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి చెప్పారు. దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కుర్రి సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన లేళ్ళ అప్పిరెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి రామారావు, కార్యదర్శి దాది నరేంద్రబాబు, సహాయ కార్యదర్శి షేక్ కరీముల్లా, కోశాధికారి కర్పూరపు కోటేశ్వరరావుతో మిర్చియార్డు ఛైర్మన్ చంద్రగిరి ఏసురత్నం ప్రమాణస్వీకారం చేయించారు. లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, మిర్చియార్డు దీనికి అనుసంధానమైన రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీలతో తనకు విడదీయరాని అనుబంధం పెనవేసుకుని ఉన్నట్లు చెప్పారు. రైతులు, వ్యాపారులను సమపాళ్ళలో ఆదరిస్తూ, వారి ప్రయోజనాలు కాపాడుతూ ముందుకు సాగాలని ఆయన అభిలషించారు. అదే సమయంలో ప్రభుత్వం తరుపున వారికి అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ నూతన కార్యవర్గం మరింత చొరవ తీసుకుని మిర్చియార్డు దినదినాభివద్ధిలో భాగం కావాలని కోరారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, గుంటూరు మిర్చికి ఘాటే కాదు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ కూడా ఎక్కువేనని పేర్కొన్నారు. డిసిసిబి బ్యాంకు ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), ఆలిండియా చిల్లీస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, ఎగుమతి సంఘం అధ్యక్షుడు జుగురాజు, కోల్డ్ స్టోరేజి అసోసియేషన్ కార్యదర్శి సురేంద్రబాబు, చిల్లీ పౌడర్ మిల్స్ అసోసియేషన్ కార్యదర్శి వై.అనిల్, కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి, దిగుమతి సంఘం మాజీ అధ్యక్షుడు కొత్తూరి సుధాకర్, వేమెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల అసంబద్ధ సర్దుబాటు నిలిపేయాలి : ఫ్యాప్టో


డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : సీనియర్ ఎస్‌జిటి ఉపాధ్యాయుల్ని స్కూల్ అసిస్టెంట్లుగా నియమించి, అలవెన్స్‌గా రూ.2500లు ఇస్తామని విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎం.కళాధర్ కోరారు. ఈ మేరకు ఫ్యాప్టో నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఉత్తర్వులు కొత్త సమస్యలు సృష్టించే విధంగా ఉందన్నారు. సర్దుబాటులో వెళ్లి పనిచేసే టీచర్లకు రూ.2500లు ఇవ్వటానికి ప్రామాణికత ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని, భవిష్యత్‌లో ఈ సాంప్రదాయం కొనసాగే ప్రమాదం ఉందన్నారు. ప్రమోషన్‌కి అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పి ఇంత వరకూ సీనియారిటీ జాబితాలుగానీ, ఖాళీల వివరాలుగానీ ప్రకటించలేదన్నారు. పని సర్దుబాటు పేరు చెబుతూ, తదుపరి జీతాలు కూడా కొత్త స్థానాల్లోనే చెల్లిస్తామని చెప్పటం గందరగోళానికి కారణమౌతుందన్నారు. కావున తక్షణమే దీనిపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, స్పష్టత ఇవ్వాలని, అప్పటి దాకా ఉత్తర్వులు నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జి.మోహన్‌రావు, ఎండి.ఖాలిద్, జి.శ్రీనివాసరావు, మేకల సుబ్బారావు, జి.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాల క్రీడలు


కబడ్డీలో పోటీ పడుతున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో రెండ్రోజులపాటు నిర్వహించిన క్రీడలు గురువారం ముగిశాయి. కబడ్డీ బాలురు విభాగంలో ఎస్‌కెబిపిఎంసిహెచ్ స్కూల్, శ్రీచైతన్య, బాలికల విభాగంలో ఎస్‌కెబిపి హైస్కూల్, కెఎస్‌ఆర్‌టి స్కూల్ విన్నర్, రన్నర్స్‌గా నిలిచాయి. కోకో బాలుర విభాగంలో సెయింట్ ఆన్స్, ఎస్‌బిఎం, బాలికల విభాగంలో కెఎస్‌ఆర్‌టి స్కూల్, శ్రీచైతన్య విన్నర్స్, రన్నర్స్ సాధించాయి. వాలీబాల్ బాలురు కాటూరి స్కూల్, కెఎస్‌ఆర్‌టి, బాలికలు కెఎస్‌ఆర్‌టి స్కూల్, ఎస్‌జిఎన్‌కె స్కూల్, షటిల్ డబుల్స్ బాలురు ఎస్‌సిఎంపి స్కూల్, భాష్యం స్కూల్, బాలికల విభాగం సెయింట్ ఆన్స్, కెఎస్‌ఆర్‌టి స్కూల్ వరుసగా విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. క్యారమ్స్ బాలురు వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్, కెఎస్‌ఆర్‌టి స్కూల్, బాలికలు లోటస్ హైస్కూల్, సత్యసాయి ఐడియల్ స్కూల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే చెస్, 200 మీటర్స్ పురుగు పందెం, లాంగ్‌జంప్, స్లో సైక్లింగ్, స్కిప్పింగ్ గరల్స్ క్రీడల్లో వ్యక్తిగత విభాగాల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు గెలు పొందారు. వీరికి 15వ తేదీ సాయంత్రం, సంక్రాంతి సంబరాలు ముగింపు సందర్భంగా మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అంద చేయనున్నారు.


డబుల్స్‌లో తలపడుతన్న క్రీడాకారులు

రెండో రోజుకు జిల్లాస్థాయి షటిల్ పోటీలు

ముగిసిన అండర్ 15, ఉమెన్ డబూల్స్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలి:కరుణా నిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజిమెన్ స్మారకంగా కొత్త ఐజక్‌శ్యామ్ బ్యాంట్మింటన్ అసోసియేషన్(కిస్బా) ఆధ్వర్యంలో రూరల్ గ్రామం కొలకలూరు రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న నాలుగు జిల్లాల స్థాయి షటిల్ పోటీలు గురువారం రెండో రోజుకు చేరాయి. హోరా హోరీగా జరుగుతున్న పోటీలలో ముందుగా నిర్వహించిన అండర్ 15 విభాగంలో విన్నర్స్‌గా తెనాలికి చెందిన సంజయ్ అండ్ అరవింద్, రన్నర్స్‌గా కొలకలూరుకు చెందిన విజ్ఞాన్ అండ్ అవినాష్, మూడవ స్థానంలో తెనాలికి చెందిన హర్ష అండ్ అనురూప్ నిలిచారు. అలాగే ఉమెన్స్ డబుల్స్‌లో కొలకలూరుకు చెందిన భవ్య అండ్ ప్రవణిదాస్ విన్నర్స్‌కాగా, రన్నర్స్‌గా తెనాలికి చెందిన మోహన అండ్ అర్షిణ్, తృతీయ స్థానంలో గీతిక అండ్ సంగీత నిలిచారు. విజేతలను జిల్లా బ్యాట్మింటస్ అసోసియేషన్ కార్యదర్శి డి.శ్రీనివాసరావు అభినందించారు. వెటరన్ డబుల్స్, మెన్ సింగల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు కొనసాగుతన్నాయని కిస్బా అధ్యక్ష కార్యదర్శులు టి.రవీంద్రబాబు, ఎస్.వినయకుమార్ తెలిపారు. కిస్బా సభ్యులు పివి రాంబాబు, కె.జార్జిథామస్, కొత్త కిరణ్మయి, ఎస్‌కె కరిముల్లా, కటికల శ్రీకాంత్, సత్యనారాయణ పోటీలను పర్యవేక్షించారు.

మాచర్లలో 22వ తేదీ వరకు 144 సెక్షన్ పొడిగింపు

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల పట్టణంలో గత నెల 17వ తేదీ నుండి కొనసాగుతున్న 144 సెక్షన్ ఈనెల 22వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పట్టణ సీఐ బాలకష్ణ తెలిపారు గత నెల 16వ తేదీన మాచర్ల పట్టణంలో వైసిపి టిడిపి వర్గాల మధ్య జరిగిన ఘర్షణ లో పలువురికి గాయాలు కావడం పెద్ద ఎత్తున ఆస్తి విధ్వంసం జరగటం తెలిసిందే శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా పెట్టిన 144 సెక్షన్ ఈనెల 22 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-గుంటూరు : ఉన్నత పాఠశాలల్లో అవసరం ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ పోస్టులలో సీనియర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్‌జిటి)ను వారి అర్హాత ఆధారంగా వసరం ఉన్న సబ్జెక్టులను నింపి, నెలకు రూ.2500లు అలవెన్స్ ఇవ్వటం జరుగుతుందని డిఇఒ పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉమ్మడి గుంటూరు జిల్లాలో, అక్టోబర్ 2022లో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీషు, లెక్కలు, బయలాజికల్ సైన్స్)గా పదోన్నతికి అంగీకారం తెలిపిన ఎస్‌జిటి ఉపాధ్యాయులు 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంగ్లీషు, మధ్యాహ్నం 2 గంటలకు లెక్కలు, బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌కు హాజరు కావా లన్నారు.

మాచర్ల నుండి హైదరాబాదుకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - మాచర్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాదు నుండి పల్నాడు ప్రాంతానికి వచ్చాయి ప్రయాణికుల రద్దీ దష్ట్యా మాచర్ల డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పిచ్చయ్య తెలిపారు. సాధారణంగా మాచర్ల నుండి రోజు 15 బస్సుల వరకు హైదరాబాద్ వెళుతుంటాయి. అవే కాకుండా అటు నుంచి వచ్చే ప్రయాణికులు అధికంగా వస్తారు. వారి సౌకర్యార్థం మరో పది బస్సులు అధికంగా సాధారణ చార్జీలతోటే నడుపుతున్నట్లు, హైదరాబాదు నుండి మాచర్ల వైపు వచ్చే ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

రోడ్డు పన్ను పెంపును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు

భారీగా పెంచిన రోడ్ టాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని, ఆటో స్టాండ్ వద్ద నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు గ్రీన్ ట్యాక్స్‌తో సంక్షోభంలో ఉన్న రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం మరో భారం మోపిందన్నారు. త్రైమాసిక రోడ్ టాక్స్ 30శాతం పెంచుతూ ఉత్తర్వులు ఇవ్వటం వల్ల రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతంలో ఆరు టైర్ల లారీలకు రూ.3940లు ఉన్న టాక్స్, ఇప్పుడు రూ.4970 పెరిగిందన్నారు.ఇలా ప్రతి వాహనానికి పెంచడం ద్వారా లారీలు, ఇతర వాహనాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని, ఇది పరోక్షంగా నిత్యావసర ధరలు పెరుగుదలకూ దారితీస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి నాయకులు వేముల శ్రీను, ఏడుకొండలు, ఖాసిం, నరసింహారెడ్డి, కోటి, వాసు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు